# అంతఃపురంలో అంధకారం

'సీతా!'

'.........'

'సీతా!'

ఈ సారి కంఠస్వరం మరింత స్పష్టంగా కొంచెం కఠినంగా ఉంది. అయినా సీత ప్రత్యుత్తరం వినిపించలేదు.

'కోడలింకా నిద్రలేవలేదు కాబోలు...పాపం...నెలల మనిషిగదా! బద్ధకంగా పడుకుందేమో!' అనుకుని కౌసల్య కొంచెం బిగ్గరగా 'సీతా! వేపపుల్ల తీసుకు రావూ...' అంది.

కౌసల్యకి వృద్ధాప్యం వచ్చింది. చూపు తగ్గుముఖం పట్టింది. అందువల్ల ఇతరుల సహాయం అభిలషించింది. అంతేకాదు. అవసరమయింది కూడా!

సీత అంటే కౌసల్యకి వల్లమాలిన అభిమానం. దాసదాసీజనం ఎంతమంది ఉన్నా, తన పనులు సీత చేస్తేనే ఆమెకు పరమ తృప్తి. పైగా ఏపని చేసినా – పెద్దదైనా చిన్నదైనా – సీత సహర్షంగా చేసేది; తృప్తి కలిగేలా చేసేది. అదీకాక అత్తగారి మనస్సు, అభిరుచులూ ఆమెకు తెలిసినట్టుగా మరొకరికి తెలియదు. దంతధావనం మొదలుకొని వస్త్రధారణం వరకూ గల అన్ని పనులూ ఆమె స్వయంగా చూసేది.

ఉదయం నిద్రనుంచి మేల్కొనగానే సీత నిర్వర్తించవలసిన మొదటిపని అత్తగారి దంతధావనానికి కావలసిన యేర్పాట్లు చేయడం.

ఆరోజు సీత నిద్రనుంచి లేవడం ఆలస్య మయింది. అప్పుడే అత్తగారు రెండుసార్లు కోడల్ని పిలవడం జరిగింది.

తల్లి సీతను పిలవడం రాముడు విన్నాడు. వెంటనే మేడమీది తన గదిలోంచి బయటికి వచ్చాడు. కిందికి చూశాడు. మెట్లదగ్గర తల్లి నిలబడి వుంది.

'వస్తున్నా నమ్మా' అంటూ రాముడు ఒక హేమ పాత్రనిండా నీళ్ళు నింపుకుని మెట్లు దిగసాగాడు.

'ఇదిగో నీళ్లూ...వేపపుల్ల...'

'నువ్వే తీసుకువచ్చావా నాయనా..' అంటూ కౌసల్యా రాముడి వంక చూసింది. ప్రసన్నవదనుడుగా లేడు. ఆమె భయభ్రాంత అయింది. 'కోడలింకా నిద్రలేవలేదు కాబోలు... నెలల మనిషిగదా!' రాముడికి కోపం రాదు. వస్తే ప్రళయమే. ఆ సంగతి ఆమెకు తెలుసు. అందుకే భయపడింది.

తల్లి మాటలేవీ రాముడి చెవిని పడినట్లులేదు.

'ఇంకేమన్నా కావాలా అమ్మా!'

'వద్దులే నాయనా... అదుగో కోడలే యిలా వస్తోంది.'

రాముడు వినిపించుకోకుండా చరచర వెళ్లిపోయాడు.

కౌసల్యా తల్లడిల్లి పోయింది.

'అత్తయ్యా! యివాళ లేవడం ఆలస్యమయింది.' సీత కౌసల్యను సమీపించింది. అక్కడున్న హేమపాత్రనీ వేపపుల్లనీ చూసింది. 'నా వల్ల ఆయన కెంత శ్రమ కలిగింది యివ్వాళ...' అంది తప్పు చేసినదానిలా.

'ఇంత మాత్రానికే ఏమీ అరిగిపోడులే...' పైకి అలా అన్నా, కౌసల్యకు లోపల మాత్రం భయమే. రాముడు ఏం చేస్తాడో అనుకుంది.

రోజూ ఎంతో ఉల్లాసంగా కనిపించే సీత ఆనాడు నిరుత్సాహంగా కనిపించింది.

అలా కొంచెం సేపు ఉద్యానవనంలో విహరించి వద్దామనుకుని బయలుదేరిన సీత మధ్యలోనే ఆగిపోయింది. ముందుకి నడక సాగలేదు. రామలక్ష్మణుల సంభాషణ వినిపిస్తోంది....

'అన్నయ్యా! వదిన అంత తప్పు ఏం చేసిందని యీ ఘోర శిక్ష?'

'ఇది నా ఆజ్ఞ.'

'నీ ఆజ్ఞను పాటించడం నాధర్మం. అయినా కారణం అడక్కూడదా?'

'అమ్మ మాటను విననట్లుగా వదిన నటించింది....యమునా నదీ తీరాన ఒక పర్ణశాల నిర్మించు.. అక్కడే వదిన ఒంటరిగా వుంటుంది...'

'అన్నయ్యా!'

'ఇది నా ఆజ్ఞ అన్నానుగా...' రాముడి నోటివెంట మాటరాలేదు. అసలు మాట పెగల లేదు. దుఃఖ భారాన్ని ఎలాగో అణుచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

దీన వదనుడైన లక్ష్మణుడు నాలుగు అడుగులు ముందుకు వేశాడో లేదో... వదినగారు తల వంచుకుని కనిపించింది.

అతనికి దుఃఖం ముంచుకు వచ్చింది. ఉత్తరీయంతో ముఖం చాటు చేసుకున్నాడు.

మరిదిని చూడలేకపోయింది సీత. భర్తను కలుసుకునేందుకు మేడ వైపుకి దారి తీసింది.

'ఏమిటీ అన్యాయం...'

భార్యను చూసేసరికి రాముడికి కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

'నేను చేసిన తప్పేమిటి? ఎందుకు నన్నిలా శిక్షిస్తున్నారు? నా మీద మీకు అనురాగం లేదా? అభిమానం లేదా? మీది రాతిగుండె...'

'సీతా!' రాముడు మాట్లాడలేకపోయాడు.

రాముడి ఎదను తల చేర్చి సీత వెక్కివెక్కి ఏడవసాగింది. అలా ఎంత సేపు విలపించిందో!

'సీతా! నువ్వు నా కంఠహారానివి...' గద్గదకంఠుడై రాముడు చెప్తున్నాడు. ఆమెకి అంతా అగమ్యగోచరంగా ఉంది. కాళ్ల కింది నేల కంపించి పోతోంది. అప్పటికప్పుడే ఆ పరిసరాలు గాఢాంధకారంతో నిండిపోయింది.

'సీతా! నువ్వెందుకు అత్తగారి మాట విననట్లు...' రాముడి గద్గద కంఠం వినిపిస్తోంది. సీత చెవుల్లో చెట్లు మొలిచినట్టయింది.

అంతఃపురంలో ఎవరు చూసినా నిరుత్సాహంగా కనిపించారు... అంతఃపురస్త్రీలు శోకదేవతల్లా గోచరించారు...కౌసల్య అయితే కుప్పలా కూలిపోయింది.

(కారణం ఏదైన కావచ్చు. సీతా పరిత్యాగం కటికి గుండెను సైతం కరిగించే విషాద ఘట్టం. అందుకు శిష్టకవులే కాదు జానపదకవులు కూడా స్పందించారు. కథాగేయాలు సంతరించారు. ఒక తెలుగు కథాగేయం పై కథకు ఆధారం)